## పోలీసుల అదుపులో 'గుట్ట' నగల వ్యాపారి..?

యాదాద్రి భువనగిరి, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : యాదగిరిగుట్టలో సుమారు రూ.5కోట్లతో ఉడాయించిన బంగారు నగల తాకట్టు వ్యాపారి పోలీసులకు దొరికినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనతోపాటు మరికొందరు పోలీసుల అదుపులో ఉన్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. మంగళవారం రిమాండ్ కు తరలించే అవకాశం ఉందని తెలుస్తున్నది. యాదగిరిగుట్టలో పదేండ్లుగా జ్యువెల్లరీ షాపు నిర్వహిస్తున్న సదరు వ్యాపారి జనవరి నెలలో ఉడాయించిన విషయం తెలిసిందే. ఆయన్ని నమ్మి స్థానికులు పెద్దసంఖ్యలో తమ బంగారం కుదవ పెట్టడం, కొత్త బంగారంగా కావాలనుకునే వారు అడ్వాన్స్ డబ్బులు ఇవ్వడం చేశారు.

జనవరి చివరి వారంలో ఆకస్మాత్తుగా వ్యాపారి బోర్డు తిప్పేసి కనిపించకుండా పరారయ్యాడు. ఫోన్ స్విచాప్ చేశాడు. దాంతో ఆందోళనకు గురైన బాధితులు పలు దఫాలుగా షాపు ముందు ఆందోళనలు చేశారు. తాకట్టు పెట్టుకున్న బంగారం, వడ్డీలకు తీసుకున్న నగదు మొత్తం రూ.5కోట్లకు పైగా ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఈ విషయమై పోలీసులు అప్పుడే కేసు నమోదు చేశారు. తాజాగా సదరు వ్యాపారి ఆచూకీ తెలుసుకొని రప్పించినట్టు తెలుస్తున్నది.



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరికలు

తిరుమలగిరి(సాగర్), మార్చి 24 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలంలోని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, రమావత్ జలంధర్ ఎమ్మెల్సీ సమక్షంలో సోమవారం బోయగూడెం గ్రామంలోని తన నివాసంలో బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, సీజన్‌కు ఎకరాకు రూ.7.500 రైతు భరోసా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో రైతులు ఎప్పుడూ ఇబ్బందులు పడలేదని, సమయానికి రైతుబంధు అందించి, రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వానికి సాగునీరు సక్రమంగా వినియోగించుకునే తెలివి లేక వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టదశలో ఉన్న పొలాలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీర్లగడ్డ మాజీ సర్పంచ్ సంధ్య, రాములునాయక్, దేశ్యాబాలు, పేరూరు ఆలయ మాజీ చైర్మన్ మనాది పురుషోత్తం, రమావత్ చంద్రమౌళి, జటావత్ రమేశ్, రమావత్ బీమా ఉన్నారు.

# రైతన్నకు మొండిచెయ్యి

## 2లక్షలపైన రుణమాఫీ లేనట్టే

**7 నెలల నిరీక్షణకు మిగిలింది నిరాశే**

**ప్రకటించి మాట తప్పిన కాంగ్రెస్ సర్కారు**

- **అధికంగా ఉన్న రుణం చెల్లిస్తే మాఫీ అని మొదట్లో ప్రకటన**
- **రెండు లక్షలకు పైనున్న రుణం చెల్లించి ఎదురుచూస్తున్న రైతులు**
- **ఉమ్మడి జిల్లాలో లక్ష మంది రైతులకు ఎగనామం**
- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం**

**'ఏ కుటుంబానికి అయితే 2లక్షల రూపాయలకు మించి రుణం ఉంటుందో ఆ రైతులు రూ.2లక్షలు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తరువాత అర్హత గల రూ.2లక్షల మొత్తాన్ని రైతు కుటుంబాల రుణఖాతాలకు బదిలీ చేయడం జరుగుతుంది'.. రుణమాఫీ మార్గదర్శకాల్లో రేవంత్‌రెడ్డి సర్కారు పొందుపర్చిన విషయమిది.**

– నల్లగొండ ప్రతినిధి, మార్చి 24 (నమస్తే తెలంగాణ) :



కానీ, ఇప్పుడు జరుగుతుందేంటి? అసెంబ్లీ వేదికగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన ప్రకటన ఏంటి? 'రైతులకు 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయాలనేది ప్రభుత్వ నిర్ణయం. రూ.2లక్షలకుపైగా ఉన్నవాటిపై రుణమాఫీ నిర్ణయం లేదు. 2లక్షల లోపు రుణాలున్న రైతులకు ఇప్పటికే 20,615 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశాం' అంటూ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఇప్పుడు ఇదే విషయమై ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులందరి రుణమాఫీ చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక కొర్రీల మీద కొర్రీలు పెడుతూ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొదట అందరికీ అని, ఆ తర్వాత రేషన్ కార్డు ఆధారంగా కుటుంబంలో ఒక్కరికే అని, అందులోనూ సాంకేతిక కారణాలతో రూ.2లక్షల లోపు రుణాలున్న రైతులను పక్కన పెట్టి అరకొరగా రుణమాఫీ చేయడంపై తీవ్రంగా మండిపడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాలుగు విడుతల్లో కలిపి 3.85లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగినట్లు అధికార లెక్కలు వెల్లడిస్తున్నాయి.

ఇంకా 1.75లక్షల మంది రుణమాఫీకి కోసం ఏడు నెలలుగా ఎదురుచూస్తునే ఉన్నారు. గతేడాది ఆగస్టు 15న రెండు లక్షల రుణమాఫీ ప్రకటన చేసిన ప్రభుత్వం 17వ తేదీన తొలి విడుత ప్రకటించింది. తరవాత చివరగా నవంబర్ 30న నాలుగో విడుతగా రేషన్ కార్డులు లేని వారిలో అర్హులైన వారి జాబితాను కొద్దిమందితో ప్రకటించింది. అప్పటి నుంచి నేటి వరకూ మిగతా రుణమాఫీ కాని రైతులంతా ఎదురుచూస్తూనే ఉన్నారు. అయితే ఇందులో ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు లక్ష మంది రైతులు రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారు ఉన్నట్లు అంచనా. వారిలో సగం మంది వరకు ప్రారంభంలో ప్రభుత్వం రుణమాఫీ మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లుగా రెండు లక్షలకు పైగా ఉన్న రుణాన్ని బ్యాంకులకు చెల్లించారు. ఇక అప్పటి నుంచి నేటి వరకు తమకు 2లక్షలు రుణమాఫీ అవుతుందని నిరీక్షిస్తూనే ఉన్నారు. అదనంగా ఉన్న రుణం చెల్లించడం కోసం మళ్లీ బయట ప్రైవేట్ అప్పులు చేసిన వారే ఎక్కువ మంది కావడం గమనార్హం. ఆ డబ్బులకు సంబంధించిన వడ్డీ కూడా రైతులకు భారంగా మారింది.

ఇలాంటి రైతులంతా తమకు కూడా రుణమాఫీ కాకపోతుందా, ప్రభుత్వం ప్రకటించాక వెనుకో, ముందో రాకపోతుందా అని ఎదురుచూస్తున్నారు. కానీ వారందరి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటన తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. ఇన్నాళ్లు వేచి చూసేలా చేసి తీరా ఇలాంటి మోసపూరిత ప్రకటన చేయడం ఎంతవరకు సబబని రైతుల ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రైతులను అన్ని విషయాల్లో మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా విషయంలో, బోనస్ చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇప్పటికే మాట తప్పి దగా చేసిందని, రుణమాఫీలోనూ అదే తరహా మోసానికి తెరలేపడం దుర్మార్గమని రైతులు భగ్గుమంటున్నారు. ఇక 2లక్షల లోపు రుణాలు ఉన్న రైతుల్లో సైతం 75 వేల మంది వరకు రుణమాఫీ కానట్లు అంచనా.

వీరిలో చాలామందికి ఆధార్‌కార్డు, పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తప్పు పడడం వంటి సాంకేతిక సాకులు చూపి మాఫీ చేయలేదు. ఇలాంటి వారికి సంబంధించి కూడా రుణమాఫీ లేనట్లేనని అసెంబ్లీలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనతో తేటతెల్లమైంది. మొత్తంగా ఎంత వీలైతే అంతగా రుణమాఫీని ఎగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆది నుంచి కుట్రలు చేస్తుందన్న విమర్శలకు మంత్రి తాజా ప్రకటన బలమైన ఆధారంగా నిలుస్తున్నది.

### రుణమాఫీ కోసం తిరుగుతనే ఉన్నా



పోచంపల్లి కెనరా బ్యాంకులో వ్యవసాయ అవసరాల కోసం మా కుటుంబంలో ఇద్దరం రూ.3లక్షల లోన్ తీసుకున్నాం. ప్రభుత్వం రూ.2లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేస్తుందని ప్రకటించడంతో పాతిక వేలు అప్పు తెచ్చి వడ్డీ మొత్తం కట్టిన. డబ్బులు కట్టినట్టు వ్యవసాయ శాఖ కార్యాలయంలో కూడా చూపించా. ఫొటో కూడా తీసుకున్నరు. కానీ ఇప్పటి వరకు అసలు రుణం మాఫీ కాలేదు. గవర్నమెంటేమో అందరికీ మాఫీ చేసినం అంటుంది. నాకైతే ఇప్పటిదాకా కాలేదు. రుణమాఫీ ఎప్పుడైతదా అని ఏఓ ఆఫీసు, బ్యాంకు చుట్టూ తిరుగుతనే ఉన్నా.

**- మేకల చొక్కారెడ్డి, రైతు, శివారెడ్డిగూడెం, భూదాన్‌పోచంపల్లి మండలం**

### 25 వేలకు 4వేలు మాఫీ అయ్యింది



నాకు అరెకరం పొలం ఉంది. అదే మాకు జీవనాధారం. వ్యవసాయ అవసరాల కోసం మిర్యాలగూడలోని ఎస్‌బీఐలో 11వేలు లోన్ తీసుకున్నా. వడ్డీతో కలిపి మొత్తం రూ.25వేలు అయ్యింది. ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలిసి బ్యాంకుకు వెళ్లి అడితే.. 4వేల రూపాయలే రుణ మాఫీ అయ్యింది చెప్పారు. నేనే బ్యాంకుకు రూ.21వేలు తిరిగి చెల్లించాలని చెప్పడంతో ఏం చేయాల్నో పాలుపోలేదు. వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులను బతిమిలాడినా మా చేతిలో లేదంటున్నారు. రెండు రూపాయల లోపు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం పాతిక వేలు కూడా చెయ్యకపోతే నాలాంటి చిన్న రైతులు ఏంకావాలి.

**- సిరసనగండ్ల రామకృష్ణాచారి, రైతు, దిలావర్‌పూర్, దామరచర్ల మండలం**

### లిస్టులో పేరు వచ్చింది కానీ పైసా మాఫీ కాలేదు



పోచంపల్లి కెనరా బ్యాంకులో నాకు రూ. 92వేలు రుణం ఉంది. రుణమాఫీ జాబితా లిస్టులో నా పేరు వచ్చింది. జనవరి 6న రెన్యూవల్ చేసుకున్నా. అకౌంట్ నంబర్ మారినందుకు నాకు రుణమాఫీ కాలేదని చెప్తున్నారు. వ్యవసాయాధికారులను అడిగితే తెలియదంటున్నారు. నాకు ఇంతవరకు ఒక్క పైసా కూడా రుణమాఫీ కాలే.

**- మంచాల నరసింహ, రామలింగంపల్లి గ్రామం, భూదాన్‌పోచంపల్లి మండలం**

### తిరిగి తిరిగి అలిసిపోయిన



నేను బ్యాంకులో రెండున్న లక్షలు వ్యవసాయ రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2 లక్షల రుణమాఫీ చేస్తామంటే నమ్మి అసలు, వడ్డీ కట్టలేదు. మిత్తితోని కలిపి 3లక్షల 75 వేలు అయ్యింది. రూ.2 లక్షలపైనే ఉన్న డబ్బు చెల్లిస్తే మాఫీ అవుతుందని ఐదు నెలల కింద రూ.1.75లక్షలు బ్యాంకులో కట్టిన. అయినా మిగిలిన రూ.2 లక్షలు రుణమాఫీ మాత్రం కాలేదు. బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయిన.

**- చింతకాయల లింగమ్మ, రైతు, త్రిపురారం**

### ఆధార్ వేరే బ్యాంకుకు లింక్ అయ్యిందని రుణమాఫీ చెయ్యలేదు



నాకు రెండున్నర ఎకరాల భూమి ఉంది. గడ్డిపల్లిలోని ఎస్‌బీఐలో లక్షా 10 వేలు లోన్ తీసుకున్నాను. ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలియడంతో ఆశగా బ్యాంకు వెళ్తే నిరాశే ఎదురైంది. ఆధార్ కార్డు వేరే బ్యాంకుతో లింకై ఉందని సాకు చూపి ఇంతవరకూ రుణమాఫీ చెయ్యలేదు. ప్రభుత్వం స్పందించి నాకు రుణమాఫీ చేయాలి.

**- మచ్చ కృష్ణ, పానుగోడు, గరిడేపల్లి మండలం**

# వైద్యారోగ్యశాఖకు అవినీతి రోగం!

- **ప్రసూతి, అనారోగ్యంతో సెలవులో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులే టార్గెట్**
- **కొన్నిసార్లు డిప్యూటేషన్లు, మరి కొన్ని మేనేజ్‌మెంట్లు**
- **21మందినుంచి లక్షల రూపాయలు వసూలు**

సూర్యాపేట, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా వైద్యారోగ్యశాఖకు అవినీతి రోగం పట్టుకుంది. ఇటీవల ఓ సస్పెండ్ అయిన ఉద్యోగికి సగం జీతం ఇచ్చేందుకు లక్ష రూపాయలు డిమాండ్ చేసిన విషయం వెలుగులోకి రావడం తెలిసిందే. అలాగే ప్రసూతి సెలవులు తీసుకునేవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఉద్యోగులను టార్గెట్ చేసిన వారి వేతనాలు దండుకుంటుండడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ శాఖలో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులు లేవు. దాంతో వారు సెలవులు పెడితే క్రమబద్ధీకరణ సమయంలో సర్వీస్ బ్రేక్ నిబంధన అడ్డు వస్తుంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమందికి అక్రమ డిప్యూటేషన్లు ఇవ్వడం, మరికొందరిని పని చేసే చోటే మేనేజ్ చేయడం చేసి లక్షల రూపాయలు దండుకుంటున్నట్లు తెలుస్తున్నది. గత నాలుగేండ్లలో దాదాపు 21 మంది నుంచి ఇలా సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి ఏఎన్ఎం లేదా ఎంపీహెచ్ఏ(ఆడ)లకు నిర్దిష్ట ఉద్యోగం తప్ప వేరే ఇతర విధులు చేయడానికి వర్క్ ఆర్డర్లు ఇవ్వవద్దని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నుంచి స్పష్టంగా ఆదేశాలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. దాంతో ఆయా ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలు పని చేసే గ్రామాల్లో ఆరోగ్య సేవలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతంలో ఆత్మకూర్.ఎస్ మండలంలో పని చేసిన ఓ ఏఎన్ఎం గర్భం దాల్చిన సమయంలో ప్రసూతి సెలవుల కోసం జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారికి కలిశారు. జిల్లా కార్యాలయంలో అధికారికి సన్నిహితంగా ఉండే ఒకరు 'నువ్వు సెలవు పెట్టుకుంటే క్రమబద్ధీకరణ సమయంలో ఆటంకాలు వస్తాయి. డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి బదిలీ చేయిస్తాం. అధికారితో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నీకు వచ్చే నెలనెలా వేతనాన్ని మాకు ఇస్తే చాలు. సర్వీస్ బ్రేక్ కాదు' అని చెప్పడంతో ఆమె కూడా అంగీకరించారు. ఇలా ఐదు నెలల పాటు వేతనం పడడమే ఆలస్యం నెల నెలా ఆమె వద్దకు వెళ్లి తీసుకున్నట్లు విశ్వసనీయం సమాచారం. కార్యాలయం రిజిస్టర్‌లో పేరు ఉండకుండా, అటెండెన్స్ లేకుండా, విధులు నిర్వర్తించకుండానే జీతం వస్తుండడం, వాటిని కార్యాలయం అధికారి పేరు చెప్పి వచ్చి తీసుకువెళ్తుండడం నచ్చని సదరు ఏఎన్ఎం ఏకంగా జాబ్‌కు రిజైన్ చేసినట్లు కార్యాలయం వర్గాల ద్వారా తెలిసింది.

మరో ఘటనలో జిల్లా కేంద్రంలోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న ఓ ఏఎన్ఎం టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వోద్యోగం రావడంతో అటు వెళ్లారు. అయినప్పటికీ ఆరు నెలల పాటు ఆమె పేరుతో జీతం అకౌంట్‌లో వేసి నెలనెలా కాజేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో తీసుకున్న డబ్బులన్నీ సదరు ఉద్యోగినికి ఇచ్చి రిటర్న్ చేయించినట్లు కార్యాలయం సిబ్బందే మాట్లాడుకుంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు సెలవులు పెట్టకుండానే ఉద్యోగాలు చేయకున్నా మేనేజ్ చేయడం, కొంత మందిని డిప్యూటేషన్లపై జిల్లా కేంద్ర కార్యాలయానికి తెచ్చి కాగితాలపైనే డ్యూటీలు చేయించడం వంటివి చేస్తున్నారు.

గత నాలుగేండ్లలో దాదాపు 21కి మంది నుంచి ఇలా దాదాపు రూ.22 లక్షలు అక్రమంగా వసూలు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఉన్నతాధికారికి తెలిసే జరిగాయని, ఆయన సలహాలు, సూచనలతోనే ఈ అక్రమాలు జరగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ చేపడితే అక్రమాలు వెలుగులోకి వస్తాయని పేరు బహిర్గతం చేయడానికి ఇష్టపడని ఓ ఉద్యోగి తెలిపారు. కాగా, ఈ అక్రమాలపై పూర్తి ఆధారాలతో ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్–హైదరాబాద్, ఏసీబీ, విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట పట్టణ పేదల సంఘం ధర్నా




నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పట్టణ పేదల సంఘం నాయకులు

నల్లగొండ, మార్చి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పేదల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం సోమవారం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా పేదలకు రూ.12వేలు ఇస్తామని చెప్పిన అనేక కొర్రీలతో పెట్టిందని, పట్టణ ప్రాంత ప్రజలను దూరం పెట్టిందని మండిపడ్డారు. భూములేని పేదలు పట్టణాల్లో ఉన్నంత మాత్రాన అర్హులు కాదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో భూములు లేక, పనుల్లేక పట్టణాలకు వచ్చి అడ్డాకూలీలుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాషం, పట్టణ పేదల సంఘం అధ్యక్షుడు దండంపల్లి సత్తయ్య, ఎండీ సలీమ్, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నర్సింహ, దండంపల్లి సరోజ, మైల యాదయ్య, కోట్ల అశోక్ రెడ్డి, గాదె నర్సింహ, భూతం అరుణ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళిత బంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలి

- కందుల లక్ష్మయ్య



కలెక్టరేట్ ఆవరణలో దళితబంధు సాధన సమితి సభ్యులు

నల్లగొండ, మార్చి 24 : దళిత బంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి చైర్మన్ కందుల లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ నియోజక వర్గంలో 1,056 మందికి దళిత బంధు రెండో విడుత నిధులు మంజూరు గత ప్రభుత్వం చేస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాలు తెరిచి డబ్బులు జమ చేసిన తరువాత ఎన్నికల కోడ్ కారణంగా అకౌంట్‌లు ఫ్రీజ్ చేసిన అధికారులు తిరిగి గ్రౌండింగ్ కూడా చేయలేదన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తమకు డబ్బు అందకుండా చేసిందని, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని రెండో విడుత దళిత బంధు నిధులు విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆదిమల్ల లింగయ్య, తీగల ఎల్లేశ్, అశోక్, కత్తుల యాదయ్య, రూపని రవి, కిన్నెర వెంకన్న, వెంకటేశ్, మామిడి ఎల్లయ్య పాల్గొన్నారు.

# పంటల బీమా ఏమాయె?

## పత్తాలేని కాంగ్రెస్ ఎన్నికల హామీ

- **రైతుల ప్రీమియం కూడా చెల్లిస్తామని గప్పాలు**
- **ఏడాదిన్నర దాటినా పట్టించుకోని ప్రభుత్వం**
- **ఉమ్మడి జిల్లాలో వేల ఎకరాల్లో ఎండుతున్న పంటలు**
- **సర్కారు నిర్వాకంతో పరిహారం అందని దుస్థితి**
- **ప్రభుత్వంపై మండి పడుతున్న రైతాంగం**

*'సమగ్ర పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తాం. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం. పంటల బీమా పథకానికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం కూడా మేమే చెల్లిస్తాం' అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ఇది. పార్టీ మేనిఫెస్టోలోనూ పొందుపరిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా పంటల బీమా పథకం మాత్రం పత్తా లేదు. సీజన్లకు సీజన్లు గడిచిపోతున్నా అడుగు ముందుకు పడలేదు. ఈ యాసంగిలో సాగు నీరు అందక, భూగర్భజలాలు అడుగంటి వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతుండగా, సర్కారు నిర్లక్ష్యంతో రైతులు నష్టపరిహారానికి కూడా నోచడం లేదు.*

*– యాదాద్రి భువనగిరి, మార్చి 24 (నమస్తే తెలంగాణ)*

ప్రకృతి వైపరీత్యాలు రైతన్నలతో దోబూచులాడుతుంటాయి. విత్తనం మొదలుకొని పంట చేతికందే వరకు భరోసా ఉండదు. ఆరుగాలం అనేక కష్టనష్టాలకు ఓర్చి రెక్కలుముక్కలు చేసుకునే రైతన్నకు దక్కే ఫలితం అంతంత మాత్రమే. ఇలాంటి సమయాల్లో పంటల బీమా ఎంతగానో దోహదపడుతుంది. భారీ వర్షాలు, వడగండ్లు, కరువు, వరదలు, తెగుళ్లు, విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే ఆ నష్టాన్ని బీమా ఎంతోకొంత కవర్ చేస్తుంది. రైతులకు ఆర్థిక నష్టం నుంచి రక్షణ దొరుకుతుంది. పంటల దిగుబడిలో ఊహించని నష్టాలను పూడుస్తుంది.

### ఏడాది దాటినా బీమా మాటే లేదు..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలివి కాని హామీలు ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా చేతులెత్తేసింది. అందులో పంటల బీమా పథకం ఒకటి. గత వానకాలం సీజన్ నుంచే అమలు చేస్తామని గప్పాలు కొట్టినా అమలుకు మాత్రం నోచలేదు. ఇప్పటికే రెండు యాసంగి, రెండు రబీ సీజన్లు గడిచినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పంటల బీమా అమలు చేయడంతోపాటు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం కూడా తమే చెల్లిస్తామని ప్రగల్బాలు పలికి ఇప్పుడు మాత్రం ఉలుకూపలుకూ లేకుండా మిన్నకుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



చిట్యాల మండలం పిట్టంపల్లిలో ఎండిన వరి పొలంలో మేస్తున్న పశువులు

### ఎండుతున్న పొలాలు..

జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.19లక్షల ఎకరాల్లో సాగు అంచనా ఉండగా, రైతులు 2.80లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇందులో అధిక శాతం వరి సాగు చేశారు. అయితే ఓ వైపు నీళ్లు లేక.. మరోవైపు ఎండలతో కండ్ల ముందే వరి పొలాలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో పంటను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీళ్లు పడుతున్నారు. ఇంకొందరు పంటలు ఎండిపోవడంతో పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 20వేలకు పైగా ఎకరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలో సుమారు రెండు లక్షల మందికి పైగా రైతులు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 5.39లక్షల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయగా వాటిలో 50వేల ఎకరాలకు పైగా ఎండిపోయాయి. కాంగ్రెస్ పంటల బీమా అమల్లోకి తెచ్చి ఉంటే ఇయ్యాల రైతులకు ఎంతో భరోసాగా ఉండేది. ఎండిపోయిన పంటలకు బీమా కవర్ అయ్యేది. కానీ ఇప్పుడు పంటలు ఆగమవుతున్నా పరిహారం దక్కని పరిస్థితి నెలకొంది.

### లోక్‌సభ ఎన్నికల ముందు హడావుడి

గతేడాది లోక్‌సభ ఎన్నికలు సమయంలో రైతుల నుంచి ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ సర్కారు మరోమారు హంగామా చేసింది. పంటల బీమా అమలు చేస్తామంటూ బీమా కంపెనీలతో చర్చలు జరిపి రైతులను మభ్య పెట్టింది. ఎన్నికలు ముగియగానే ఎప్పటిలాగానే సైలెంట్ అయ్యింది. కనీసం పథకం విధివిధానాలు కూడా రూపొందించ లేదు. వ్యవసాయ అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని స్పష్టం చేస్తున్నారు.

### రైతులను మోసగించడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది



కాంగ్రెస్ అంటేనే మోసాల పార్టీ. ఎన్నికల సమయంలో అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మోసం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారింది. కేసీఆర్ హయాంలో పంటలకు ఎందుకు ఇబ్బందులు రాలేదు. ఇప్పుడే ఎందుకు కష్టనష్టాలు వస్తున్నాయి? కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతోనే రైతులు అరిగోస తీస్తున్నారు. పంటల బీమా పథకం అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. బీమా అమలు చేసి ఉంటే ఎంతో పరిహారం అందేది. ఇకనైనా పంటల బీమా అమలు చేయాలి.

*– పైళ్ల శేఖర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే*